సాక్షి తిరుపతి

శనివారం ၊ 11 ၊ అక్టోబర్ ၊ 2025



సీఎంఆర్ కర్మాగారంలో అగ్నిప్రమాదం

ఏర్పేడులోని సీఎంఆర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. - 8లో



టపాసులు స్వాధీనం

అలిపిరి, రేణిగుంట పరిధిలో ఒక కంటైనర్‌లో అనుమతి లేకుండా తరలిస్తున్న టపాసులను పోలీసులు పట్టుకున్నారు. - 8లో



ఆస్పత్రి సిబ్బంది దాడి

రుయా ఆస్పత్రిలో రోగి సహాయకురాలిపై ఆస్పత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తించి దాడికి పాల్పడ్డారు. - 8లో

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

తిరుపతి సిటీ : ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లించాల్సిన గడువును ఇంటర్ విద్యామండలి ఈనెల 22 వరకు పొడిగించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులను విడుదల చేసింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు ఆర్‌ఐఓ ఈ మేరకు సమాచారం అందించారు. అలాగే రూ.1000 అపరాధ రుసుంతో ఈనెల 30వ తేదీ వరకు విద్యార్థులు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించి గడువులోపు పరీక్షల ఫీజును చెల్లించాలని ఆర్‌ఐఓ ఒక ప్రకటనలో తెలిపారు

శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలి జీవో విడుదల

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలిని అధికారికంగా ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. 17 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీలో కొట్టే సాయి ప్రసాద్ చైర్మన్‌గా 16 మంది కమిటీ సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ పాలక మండలి పదవీ కాలం 2 ఏళ్లు కొనసాగుతుందని జీవోలో పేర్కొంది. జనసేన పార్టీకి చెందిన కొట్టే సాయి ప్రసాద్‌కు చైర్మన్‌గా అవకాశం దక్కనుంది. తెలుగుదేశం పార్టీకి చెందిన చెంచమనాయుడు, ఇతర సభ్యులకు నిరాశ తప్పలేదు. ఎప్పుడు లేని విధంగా రాష్ట్రంలో పలు ప్రాంతాల నుంచి సభ్యులను నియమించారు. స్థానికులకు ఎక్స్ అఫీషియో సభ్యులుగా అవకాశం కల్పిస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఓ సమావేశంలో తెలిపారు. అది జరుగుతుందా లేదా అనేది వేచి చూడాల్సిందే. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు విడుదల కావడంతో జన సైనికుల సంబరాలు చేసుకున్నారు.

ఎట్టకేలకు విడుదలైన పీజీ ఫలితాలు

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన ఎంఏ, ఎంఎస్సీ మూడవ సెమిస్టర్ ఫలితాలను అధికారులు ఎట్టకేలకు శుక్రవారం విడుదల చేశారు. ఏపీ ఆర్‌సెట్ నోటిఫికేషన్ ఈనెల 7న విడుదలైన నేపథ్యంలో పీజీ ఫలితాలు సుమారు 10నెలలు గడుస్తున్నా విడుదల కాకపోవడంతో విద్యార్థులు పీహెచ్‌డీ ప్రవేశాలకు దూరమవుతున్నారని సాక్షి పత్రికలో 'అధికారుల నిర్లక్ష్యం ..విద్యార్థులకు శాపం' శీర్షికన మంగళవారం కథనం ప్రచురితమైంది. దీనిపై వర్సిటీ అధికారులు స్పందించారు. ఆగమేఘాల మీద పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. దీంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

పరిశోధనలకు పెద్దపీట

- బాధ్యతల స్వీకరణలో ఎస్వీయూ వీసీ తాతా నర్సింగరావు



తిరుపతి సిటీ: ఎస్వీయూలో నూతన పరిశోధనలకు పెద్దపీట వేసి దేశంలోనే నంబర్ వన్ వర్సిటీగా నిలిపేందుకు తన వంతు కృషి చేస్తానని నూతన వీసీ తాతా నర్సింగరావు తెలిపారు. శుక్రవారం వీసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిష్టాత్మక ఎస్వీయూకు వీసీగా తనకు అవకాశం రావడం గర్వంగా ఉందన్నారు. శ్రీవారి ఆశీస్సులు, బోధన, బోధనేతర సిబ్బంది సహకారం, అందరి సమన్వయంతో వర్సిటీని అభివృద్ధి పథంలోకి నడిపిస్తానన్నారు. తాను సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించి అంచెలంచెలుగా ఎదుగుతూ, రాష్ట్రపతి అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. దేశ, విదేశాలలో పలు పరిశోధన రంగాలలో పనిచేశానని, ఐఐటీ, ఎన్ఐటీ సంస్థలలో పనిచేసిన అనుభవం ఉండడంతో నూతన టెక్నాలజీని ఉపయోగించి రీసెర్చ్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంతో పాటు ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు.

అనారోగ్యశ్రీ

పేదలకు భరోసాగా ఉన్న ఆరోగ్యశ్రీ ప్రస్తుతం అనారోగ్యశ్రీగా మారిపోయింది. ప్రైవేటు ఆస్పత్రులకు ఆరోగ్యశ్రీ కింద చేసే వైద్యానికి ప్రభుత్వం నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో వారు వైద్యసేవలను నిలిపివేశారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఏడాదిన్నరగా బకాయిలు ఇవ్వకపోవడంతో ఆసుపత్రులు బంద్‌ను పాటించాయి. గతంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 3 వేలకు పైగా వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చి కార్పొరేట్ వైద్యాన్ని పేదలందరికీ అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేసినా పట్టించుకోకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.



ఆరోగ్యశ్రీ నిలిపివేసినట్లు తిరుపతిలోని పలు ఆసుపత్రులలో వెలసిన బోర్డులు

- రోగులకు ఆరోగ్యశ్రీ వైద్య సేవలు దూరం
- నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు
- నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించని బకాయిలు
- వైద్యసేవలు ఆగినా..పట్టించుకోని కూటమి
- ఆసుపత్రుల వద్ద ఆరోగ్యశ్రీ నిలిపేస్తున్నట్లు ఫ్లెక్సీలు
- ఇబ్బందులు పడుతున్న రోగులు

తిరుపతి తుడా : పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించాలన్న గొప్ప సంకల్పంతో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ఆగిపోయాయి. పేదల వైద్యంపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుండడంతోనే ఈ గడ్డు పరిస్థితులు ఎదురయ్యాయి. ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఏడాదిన్నరగా బకాయిలు చెల్లించకపోవడంతో ఆసుపత్రులు బంద్‌ను పాటించాయి. ఈ క్రమంలో శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి.

ఆసుపత్రులు నడపలేమని..

తిరుపతి జిల్లాలో 38 నెట్‌వర్క్ ఆసుపత్రులు ద్వారా పేదలకు ఆరోగ్యశ్రీ వైద్య సేవలు ఉచితంగా పొందుతున్నారు. ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందించిన నెట్ వర్క్ ఆసుపత్రులకు ఏడాదిన్నరగా ప్రభుత్వం చిల్లి గవ్వ విడుదల చేయలేదు. దీంతో ఆసుపత్రుల నిర్వహణపై తీవ్ర ప్రభావం పడింది. బకాయిలు చెల్లించకుంటే తాము ఆసుపత్రులను నడపలేమని తెగేసి చెప్పాయి. ఈ క్రమంలో ఆ ఆసుపత్రుల అసోసియేషన్ సంఘం నేతలు ప్రభుత్వానికి అనేకమార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలోనే ఆ సంఘం పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలను నిలిపివేశాయి.

వైద్యసేవలకు గ్రహణం

పేదల వైద్యానికి రాష్ట్రంలో గ్రహణం పట్టుకుంది. పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించాలనే సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తొలిసారి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రతిసారి ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసే దిశగానే అడుగులు వేసింది. 2019లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక ఆరోగ్యశ్రీ పరిధిలోకి మూడు వేలకు పైగా వ్యాధులను తీసుకొచ్చారు. పొరుగు రాష్ట్రాల్లోనూ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యాన్ని పొందే విధంగా జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోమారు ఆరోగ్యశ్రీ వైద్య సేవలపై అంధకారం నెలకొంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించకుండా నెట్ వర్క్ ఆసుపత్రులను కూటమి ప్రభుత్వం వేధిస్తోంది.

సేవలు నిలిపివేస్తూ ఫ్లెక్సీలు

ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అక్టోబర్ 10 నుంచి బంద్ నేపథ్యంలో ఆసుపత్రుల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అలానే ఆరోగ్యశ్రీ కౌంటర్ల వద్ద కంప్యూటర్లకు ఆరోగ్యశ్రీ సేవలు బంద్ అంటూ నోటీస్ బోర్డును ఏర్పాటు చేశారు. అయితే అత్యవసరంగా వచ్చిన ఆరోగ్యశ్రీ సేవలను మాత్రం కొనసాగించారు. రోగుల పరిస్థితులను చూసి ఆసుపత్రి యాజమాన్యం సహృదయంతో స్పందించింది. అత్యవసర వైద్య సేవలను అందించాయి.



పేదల ప్రాణాలతో చెలగాటం


తిరుపతి జిల్లా వ్యాప్తంగా 38 నెట్‌వర్క్ ఆసుపత్రులలో రోజుకు 800 నుంచి వెయ్యికి పైగా రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ బకాయిలు చెల్లించకపోవడంతో సంబంధిత ఆసుపత్రులు బంద్‌లోకి వెళ్లాయి. దీంతో వైద్య సేవలు అనేక ఆసుపత్రుల్లో ఆగిపోయాయి. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం పొందేందుకు అనేక ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు ఇబ్బందులు పడ్డారు. పూర్తిస్థాయిలో ఆరోగ్యశ్రీ ఓపీ సేవలను నిలిపివేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో రూ. 200 నుంచి ఎనిమిది వందల వరకు ఓపి చెల్లించి సాధారణ వైద్య సేవలను పొందాల్సిన పరిస్థితి వచ్చింది. ఆపై రూ. వెయ్యి నుంచి రూ. 6 వేల వరకు మందుల కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఆరోగ్యశ్రీ లేకపోవడంతోనే పేద రోగులపై ఈ భారం పడుతోంది. ఆరోగ్యశ్రీ సేవలకు బంద్ ప్రకటించడంతో రోగులు లేక అనేక ఆసుపత్రులు వెలవెలపోయాయి. ఆరోగ్యశ్రీ ఓపీ సేవలు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. వైద్య సేవలు లేవని ఆసుపత్రులు ప్రకటించడంతో ముందస్తు సమాచారం తెలియకుండా వచ్చిన రోగులు వెను తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. ఆరోగ్యశ్రీ సేవలు లేవని చెప్పడంతో రోగులు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు.

రూ.290 కోట్లకు పైగా బకాయిలు



ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందించిన ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు వేల కోట్లకు పైగా బకాయిలు పడింది . తిరుపతి జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.290 కోట్లకు పైగా చెల్లించాల్సి ఉంది. ఏడాదిన్నరగా బకాయిలు పేరుకుపోవడంతో ఆసుపత్రులను నడిపించడం యజమానులకు సవాల్‌గా మారింది. ఆసుపత్రుల్లో సిబ్బందికి జీతాలు చెల్లించే పరిస్థితులు లేవంటూ యజమానులు గగ్గోలు పెడుతున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించేందుకు ముందుకు రాలేదు. గడిచిన ఆరు నెలలుగా ఆరోగ్యశ్రీ బకాయిలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు వైద్య సేవలను నిలిపివేస్తూ బంద్‌ను పాటించాయి. జిల్లాలోని తిరుపతి, గూడూరు ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశాయి. కొన్ని ఆసుపత్రులలో అత్యవసర వైద్య సేవలను మాత్రం కొనసాగించాయి.

ఇబ్బందులు పడ్డాం



“పేదల వైద్యానికి ప్రభుత్వం భరోసా ఇవ్వాలి. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించాలి. బకాయిలు చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడంతో ఇబ్బందులు పడ్డాం. వెంటనే ఆరోగ్యశ్రీని కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అన్నమయ్య జిల్లా నుంచి వచ్చా. ఓపి రూ. 600, మెడిసిన్ రూ. 4500 ఖర్చు అయింది. ఆరోగ్యశ్రీ సేవలు ఉంటే నాకు ఈ భారం తప్పేది. చిన్న రైతు అయినా నాకు ఈ డబ్బు ఎంతో భారం.

– వెంకట రమణారెడ్డి, పీలేరు, అన్నమయ్య జిల్లా

గుండె మార్పిడి విజయవంతం

- 14 ఏళ్ల బాలుడికి 28 ఏళ్ల యువకుడి గుండె అమరిక
- 4:30 గంటల పాటు కొనసాగిన ఆపరేషన్
- ఇప్పటి వరకు 21 గుండె మార్పిడులు

తిరుపతి తుడా : తిరుపతిలోని టీటీడీ శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ కార్డియాక్ కేర్ సెంటర్‌లో శుక్రవారం 21వ గుండె మార్పిడిని వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం 14 ఏళ్ల బాలుడికి 28 ఏళ్ల యువకుడి గుండెను అమర్చారు. 4:30 గంటలపాటు వైద్యుల బృందం శ్రమించి గుండె అమరికను విజయవంతంగా పూర్తి చేశారు . ఇప్పటి వరకు ఈ ఆసుపత్రిలో 21 మందికి గుండె మార్పిడిలు పూర్తి చేశారు. తిరుపతి జిల్లా సత్యవేడుకు చెందిన 12 సంవత్సరాల బాలుడు గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు చెన్నైలోని ప్రముఖ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్య పరీక్షలు నిర్వహించగా గుండె పూర్తిగా పాడైపోయిందని తక్షణం గుండె మార్పిడి అవసరం అని తేల్చారు. పేద కుటుంబం కావడంతో ఉచితంగా గుండె మార్పిడి చేసుకోవాలంటే తిరుపతి శ్రీ పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్‌కు వెళ్లాలని సూచించారు. గత నెల 7వ తేదీన ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. అటు నుంచి పద్మావతి కార్డియాక్ కేర్ ఆసుపత్రి వైద్యులు ఆ బాలుడికి చికిత్స అందిస్తూ వస్తున్నారు. గుండె అవసరాన్ని అవయవ దాన్ వెబ్ సైట్ లో నమోదు చేయించారు.



ఎయిర్ అంబులెన్స్ నుంచి గుండెను తీసుకొస్తున్న వైద్యుల బృందం

విజయవంతం చేసిన వైద్యుల బృందం

సరిగ్గా మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు గుండె మార్పిడి చికిత్సను ప్రారంభించారు . రాత్రి 8 గంటలకు సరిగ్గా నాలుగు గంటల 30 నిమిషాల పాటు గుండె మార్పిడి చికిత్సను వైద్యుల బందం విజయవంతంగా పూర్తి చేసింది ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ సందీప్ , డాక్టర్ హర్ష ,డాక్టర్ మధు లా తో కూడిన వైద్యుల బృందం గుండె మార్పిడి చికిత్సలో పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకొచ్చిన విజయ్ కృష్ణ కుటుంబ సభ్యులు

గుంటూరు ప్రాంతానికి చెందిన 28 ఏళ్ల యువకుడు విజయ్ కృష్ణ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. యువకుడికి గుంటూరు కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందించారు. విజయ్ కృష్ణ బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు ప్రకటించారు. యువకుడి కుటుంబ సభ్యులు అవయవ దానానికి ముందుకు వచ్చారు. దీంతో అప్పటికే అవయవ దాన్ లో నమోదు చేసుకున్న 12 ఏళ్ల యువకుడు కి గుండె అత్యవసరమని గుర్తించారు. సమాచారాన్ని పద్మావతి కార్డియాక్ కేర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డికి సమాచారం అందించారు. వైద్యుల బృందాన్ని కిమ్స్ ఆస్పత్రికి పంపించి గుండెను సేకరించారు. గుంటూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు సమాచారం ఇచ్చారు. గుండె ను తీసుకొచ్చి ఎందుకు గ్రీన్ ఛానల్ లను ఏర్పాటు చేశారు. ఎయిర్ అంబులెన్స్ ద్వారా గుంటూరు నుంచి రేణిగుంట విమానాశ్రయానికి మూడు గంటల పది నిమిషాలకు తీసుకొచ్చారు. గ్రీన్ ఛానల్ ద్వారా మూడు గంటల 30 నిమిషాలకు పద్మావతి ఆసుపత్రికి తీసుకు వచ్చారు. 2 గంటల 45 నిమిషాల్లోనే గుంటూరు కిమ్స్ ఆసుపత్రి నుంచి తిరుపతి పద్మావతి ఆసుపత్రికి గుండెను విజయవంతంగా తీసుకు రాగలిగారు.

దర్జాగా జాతీయ రహదారి ఆక్రమణ !



ఎన్ హెచ్ రోడ్డు నుంచి పాత జాతీయ రహదారిని ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేపడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలం రైటార్ సత్రం సమీపంలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి 15 ఎకరాల భూమిని కొనుగోలు చేసి అందులో వెంచర్ వేసేందుకు సిద్ధపడ్డారు. ఈ వెంచర్‌కు ప్రధాన రహదారి అవసరం కావడంతో ఏకంగా వినియోగంలోని పాత జాతీయ రహదారికే ఎసరు పెట్టాడు. కలకత్తా- చెన్నై జాతీయ రహదారి నుంచి పాత జాతీయ రహదారికి రియల్ ఎస్టేట్ వ్యాపారి స్థానిక కూటమి నాయకులు అండదండలతో అప్రోచ్ రోడ్డు వేసి చదును చేస్తున్నాడు. గత ఆరు నెలల క్రితం ఇదే ప్రాంతంలో పాత జాతీయ రహదారి పక్కనే ఉన్న సుమారు 2 ఎకరాల స్థలాన్ని కొట్టేసేందుకు ప్లాన్ వేయడంతో ఎన్‌హెచ్ అధికారులు అప్పట్లో వారికి నోటీసులు జారీ చేశారు. అయితే అది ఏమైందనే విషయం బయటకు తెలియ రాలేదు. దీంతో మరోసారి రియల్ ఎస్టేట్ వ్యాపారి కూటమి నేతల అండదండలతో ఇప్పుడు ఏకంగా సుమారు 500 మీటర్ల జాతీయ రహదారి (పాతది) ఆక్రమించి రియల్ ఎస్టేట్ (వెంచర్‌కు) మార్గం సుగుమ చేసుకున్నాడు. ఇక్కడ రహదారి ఆక్రమణలపై ఆర్‌అండ్‌బీ అధికారులు తమ పరిధిలోకి రాదని చెబుతుండగా , ఎన్‌హెచ్ అధికారులు మాత్రం ఈ విషయం ఉన్నతాధికారులు పరిశీలించిన అనంతరం చర్యలు చేపడతామని చెబుతుండడం విశేషం.

'కోటి సంతకాల'తో నిలదీస్తాం

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఉద్యమం
- సంతకాల సేకరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ శిరీష, రవిచంద్రారెడ్డి తదితరులు

తిరుపతి మంగళం : పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా 17 మెడికల్ కళాశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, ఉన్నత ఆశయానికి గండి కొడుతున్న కూటమి సర్కారు వైఖరికి వ్యతిరేకంగా కోటి సంతకాలు సేకరించి నిలదీస్తామని మేయర్ శిరీష స్పష్టం చేశారు. శుక్రవారం ఈ మేరకు పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసి రూ. వేల కోట్లు దండుకోవడానికే చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. దీనికి నిరసనగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, పార్టీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ ప్రారంభిస్తున్నట్లు వివరించారు. చంద్రబాబుకు అమరావతిలో రాజధాని నిర్మాణంపై ఉన్న శ్రద్ధ మెడికల్ కాలేజీలపై లేదన్నారు. అమరావతిలోని టీడీపీ నేతల భూములకు ధరలు పెంచుకునేందుకే రాజధాని నిర్మాణంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారని ఆరోపించారు. ఏడాదిన్నర కాలంలో తెచ్చిన రూ. లక్షల కోట్లు అప్పులు ఏంచేశారని ప్రశ్నించారు. జగనన్నకు మంచి పేరు వస్తుందనే కక్షతోనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కుట్రపూరితంగా మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, కార్పొరేటర్ ఆరణి సంధ్య, నేతలు ఉదయ్‌వంశీ, కట్టా గోపీయాదవ్, వాసుయాదవ్, గీతాయాదవ్, మల్లం రవికుమార్, దినేష్‌రాయల్, మద్దాలి శేఖర్, మురళి, గోపాల్‌రెడ్డి, లవ్లీ వెంకటేష్, వెంకటేష్ రాయల్, రమణారెడ్డి, ధనశేఖర్, పద్మజ, శారద, విజయలక్ష్మి, శాంతారెడ్డి పాల్గొన్నారు.



కోటి సంతకాల సేకరణ పత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

చిల్లకూరు : మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు అప్పగించే నిర్ణయాన్ని అడ్డుకుంటామని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సనత్‌నగర్‌లో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పేద విద్యార్థులు మెడిసన్ విద్యను పూర్తి చేసి ఉన్నత స్థాయికి చేరుతారనే అక్కసుతో కూటమిలోని పెద్దలు మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్య బట్టారు. పట్టణంలోని ప్రతి వార్డులో సంతకాల సేకరణ ఉద్యమంలా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ బొమ్మిడి శ్రీనివాసులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు నూతన ఆవిష్కరణలు అవసరం



ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి తుడా : దేశంలో కాలుష్య నివారణపై పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని, నూతన ఆవిష్కరణల వైపు దృష్టి సారించాల్సి అవసరం ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పేర్కొన్నారు. న్యూఢిల్లీ వేదికగా జరిగిన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కాలుష్యం నేడు ప్రమాదకరమైన స్థాయికి చేరిందని, కాలుష్య ఉద్గారాలను కనిష్ట స్థాయికి తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. జల వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు.

క్లుప్తంగా

గురుకుల విద్యార్థి ఆచూకీ లభ్యం

వాకాడు : వాకాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులానికి చెందిన వరికూటి హేమంత్ అనే 9వ తరగతి విద్యార్థి రెండు రోజులుగా పాఠశాల హాస్టల్ నుంచి కనిపించకుండా వెళ్లిపోయాడు. ఆందోళన చెందిన పాఠశాల ప్రిన్సిపల్ కిషోర్‌తో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థి ఆచూకీ కోసం గాలించారు. ఎట్టకేలకు హేమంత్ శుక్రవారం నెల్లూరులోని తన బంధువుల వద్ద ఉన్నట్లు బంధువులు వాట్సాప్ ద్వారా తెలియజేసినట్లు హౌస్ మాస్టర్ నాగయ్య తెలిపారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

అక్రమంగా తరలిస్తున్న టపాసులు స్వాధీనం

తిరుపతి క్రైమ్ : తిరుపతి జిల్లా పరిధిలోని వేర్వేరు ప్రాంతాలలో అక్రమంగా తరలిస్తున్న అనుమతి లేని టపాసులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల మేరకు... అలిపిరి పోలీస్ స్టేషన్, రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కంటైనర్‌లో అనుమతి లేకుండా తరలిస్తున్న టపాసులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటన్నింటినీ దీపావళి పండుగకు విక్రయించేందుకు తీసుకొచ్చినట్లుగా గుర్తించామన్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటో బోల్తా : మహిళ మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన కళావతి

నాయుడుపేట టౌన్ : మండల పరిధిలోని నరసారెడ్డికండ్రిగ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యల్లంపల్లి కళావతి(30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆటోలో ఉన్న మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు. పెళ్లకూరు మండలం రోసనూరు రాజుపాళెం గ్రామానికి చెందిన యల్లంపల్లి సురేష్ అలియాస్ చెంచయ్య, అతడి భార్య కళావతి, మరికొంత మందితో కలిసి జామాయిల్ కర్రలను కొట్టే కూలి పనులకు పిడూరు గ్రామానికి గురువారం ఉదయం వెళ్లారు. అక్కడ నుంచి రాత్రి ఆటోలో స్వగ్రామానికి బయలు దేరగా మార్గమధ్యలో నరసారెడ్డి కండ్రిగ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న కళావతితో పాటు ఆమె భర్త సురేష్, బండి లలితమ్మకు గాయాలయ్యాయి. కళావతి పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానిక ఆసుపత్రి నుంచి తిరుపతిలోని వైద్యశాలకు తరలిస్తుండగా మృత్యువాత పడింది. ప్రమాద జరిగిన తీరుపై సీఐ బాబి పరిశీలించి కేసు నమోదు చేశారు.

చైనా దేశస్తుడిపై ఈడీ విచారణ పూర్తి

రేణిగుంట : మండలంలోని గురవరాజుపల్లి సమీపంలో ఉంటున్న చైనా దేశస్తుడు డ్యూ యాంగన్‌ను మూడు రోజులు పాటు విచారించిన ఈడీ అధికారులు శుక్రవారం కొన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకొని విచారణ పూర్తి చేసుకొని వెనుదిరిగారు. తదుపరి విచారణకు సహకరించాలని డ్యూ యాంగన్‌కు చెప్పి వెళ్లినట్లు సమాచారం. ఏ కేసుపై విచారణ చేస్తున్నారనే వివరాలను ఈడీ అధికారులు వెల్లడించలేదు.

మైండ్ 'బ్లాంక్'!

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 500 పోస్టులకుపైగా బ్లాక్
- నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా కౌన్సెలింగ్
- నష్టపోయామంటున్న నూతన అయ్యోర్లు


తిరుపతి జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి పోస్టింగ్‌ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : కొత్తగా ఉద్యోగంలోకి వచ్చిన డీఎస్సీ నూతన టీచర్లకు కూటమి ప్రభుత్వం శఠగోపం పెట్టింది. ఈ నెల 9, 10 తేదీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తున్న పోస్టింగ్‌ల కౌన్సెలింగ్ ప్రక్రియను నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తోంది. తమకు నచ్చిన విధంగా కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టింది. పోస్టింగ్‌ల కౌన్సెలింగ్‌లో నిబంధనలను అమలు చేయకుండా సూచించిన చోటే కోరుకోవాలని నియంతృత్వంగా వ్యవహరిస్తోంది. ఏకంగా 500 పోస్టులకు పైగా బ్లాక్ చేయడం దుమారం రేపుతోంది.

ఎప్పుడూ ఇలా లేదు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఆర్‌ఏ పేరుతో (కేటగిరీ 1, 2) పోస్టులను 500కు పైగా బ్లాక్ చేశారు. కొత్త టీచర్లకు హెచ్‌ఆర్‌ఏ పోస్టులు ఇవ్వకూడదనే నిబంధన ఎక్కడా లేదు. ఇలా బ్లాక్ చేసిన పోస్టులన్నీ ప్రధాన ప్రాంతాల్లో ఉండడంతో వాటిని డిప్యూటేషన్స్ (ప్రభుత్వ ఆర్డర్) పేరుతో దోచుకునేందుకు కుట్ర చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గతంలో డీఎస్సీ పోస్టింగ్‌లు ఇచ్చే సమయంలో పోస్టులను బ్లాక్ చేసిన సందర్భాలు లేవని యూనియన్ నాయకులు వాదిస్తున్నారు.

లోగుట్టుగా కౌన్సెలింగ్ ప్రక్రియ

తిరుపతి జిల్లా కేంద్రంలో ఎస్జీటీలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ లోగుట్టుగా నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. కౌన్సెలింగ్ నిర్వహించక ముందే నూతన టీచర్లకు ముందస్తుగా ఖాళీలను చూపించాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా మోసం చేశారు. అక్రమాలను ప్రశ్నిస్తారని ఉపాధ్యాయ సంఘ నాయకులను లోనికి అనుమంతించలేదు. కౌన్సెలింగ్ ప్రక్రియను అర్ధరాత్రిలో ప్రారంభించి వేకువ జాము వరకు నిర్వహించారు. ఒకే ప్రాంతంలో నూతన టీచర్లందరికీ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా, అలా చేయకుండా కొందరికి ఒక కేంద్రంలో, మరికొందరికీ మరొక కేంద్రంలో నిర్వహించారు. తిరుపతి జిల్లా కేంద్రంలో విశ్వం పాఠశాల శిక్షణా కేంద్రంలో ఈ నెల 9న ఉదయం 4.30 గంటల వరకు 1 నుంచి 250 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అదేవిధంగా ఈ నెల 10న మెడ్జీ స్కూల్‌లో వరుస సంఖ్య 250 కు పైన ఉన్న వారిని ఉదయం 7 గంటలకు కౌన్సెలింగ్‌కు పిలిపించి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిరీక్షింపజేశారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ ప్రక్రియను మొదలుపెట్టారు.

దివ్యాంగ ఉపాధ్యాయులకు అన్యాయం

డీఎస్సీలో ఎంపికైన దివ్యాంగ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ప్రక్రియలో అన్యాయం చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో వారికున్న రిజర్వేషన్, రోస్టర్‌ల ప్రకారం ముందస్తుగా పిలువాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా చివర్లో కౌన్సెలింగ్ నిర్వహించి దివ్యాంగ టీచర్లకు అన్యాయం చేశారు.

అవకతవకలు ఇలా...

- ఖాళీల జాబితాల్లో అవకతవకలు జరిగాయని నూతన టీచర్లు ఆరోపిస్తున్నారు. తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో టీచర్లను కేటాయించారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో టీచర్లనే నియమించలేదు. దీంతో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా మారింది.
- సీఎం సొంత నియోజకవర్గం అయిన కుప్పంలోనే అవకతవలు చోటు చేసుకున్నాయి. శాంతిపురం మండలం, శెట్టిబల్ల మోడల్ ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులున్నారు. ఆ పాఠశాలలో పోస్టులు 4 ఉన్నాయి. ఈ పాఠశాలలో ఖాళీలే లేనట్లు వేకెన్సీ జాబితాలో చూపించారు.
- శాంతిపురం మండలం శెట్టిపల్లి ప్రాథమిక మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులు 12 మందే ఉన్నారు. ఆ పాఠశాలలో శాంక్షన్ పోస్టు 1 ఉంది. అయితే ప్రస్తుత డీఎస్సీ పోస్టింగ్ ప్రక్రియ ఖాళీల జాబితాలో ఆ పాఠశాలలో 3 పోస్టులను నియమిస్తున్నట్లు చూపిస్తున్నారు.
- తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పోస్టుల ఖాళీలను చూపించలేదు.
- సబ్జెక్టు టీచర్లు అవసరం ఉన్నప్పటికీ హెచ్‌ఆర్‌ఏ ప్రాంతాల్లో పోస్టులు ఉన్నా చూపించకుండా కౌన్సెలింగ్ నిర్వహించారు.
- తొట్టంబేడులో 1, శ్రీకాళహస్తిలో 2 ప్రభుత్వ మేనేజ్‌మెంట్ స్కూల్స్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఖాళీలు ఉన్నప్పటికీ చూపించకుండా బ్లాక్ చేశారు.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ఊరట

తిరుపతి రూరల్ : ఏపీలో కూటమి ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేస్తున్న లిక్కర్ స్కాం కేసులో వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. లిక్కర్ అక్రమ కేసులో 39వ నిందితుడిగా సిట్ అధికారులు చేర్చడంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఏపీ హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను విచారణకు తీసుకున్న హైకోర్టు ధర్మాసనం కొంత కాలం ఇంటీరియం ఆర్డర్‌ను మంజూరు చేసినప్పటికీ ఈనెల 7వ తేదీన ఆ ఆర్డర్‌ను కొట్టివేసింది. దీంతో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అరెస్టు తప్పదని అందరూ భావించారు. అయితే ఆయన తనకు ఏ సంబంధంలేని లిక్కర్ స్కాం కేసులో అక్రమంగా కేసులు పెట్టి అరెస్టు చేయడానికి సిట్ అధికారులు ప్రయత్నం చేస్తున్నారని, ఆ కేసులో తనను అరెస్టు నుంచి తప్పించాలని సర్వోన్నత న్యాయస్థానానికి విన్నవించారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాదులు నిఖిల్ గోయల్, షాహిల్ రవీన్ వాదనలు వినిపించారు. ఏపీ ప్రభుత్వం, సిట్ అధికారుల నుంచి సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్ధార్థ్ లూథ్రా, సిద్ధార్థ్ అగర్వాల్ వాదించారు. ఇరు పక్షాల వాదనలను విన్న ధర్మాసనం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అరెస్టు చేయవద్దని ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు ఏపీ ప్రభుత్వానికి, సిట్ అధికారులకు నోటీసులు పంపుతూ ఈ కేసులో అఫిడవిట్లు ఫైల్ చేయడానికి నాలుగు వారాల సమయం కేటాయించి కేసును వాయిదా వేసింది. దీంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి భారీ ఊరట లభించినట్లయ్యింది.

సీఎంఆర్ కర్మాగారంలో అగ్నిప్రమాదం

- 8 మంది కార్మికులకు అస్వస్థత
- ఎగసిపడిన మంటలు
- భయంతో కార్మికులు పరుగులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికురాలు


ఏర్పేడు మండలం చింతలపాలెం టోల్‌గేట్ సమీపంలో సీఎంఆర్ ఎకో కర్మాగారం నుంచి ఎగసిపడుతున్న మంటలు

ఏర్పేడు : మండలంలోని చింతలపాళెం టోల్ గేట్ సమీపంలోని సీఎంఆర్ ఎకో అలైవీల్ తయారీ పరిశ్రమలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. అకస్మాత్తుగా మంటలు దట్టమైన పొగతో వ్యాపించటంతో ఫ్యాక్టరీలో పని చేస్తున్న సుమారు 200 మంది కార్మికులు, సిబ్బంది భయంతో రోడ్డుపైకి పరుగులు తీశారు. 8 మంది మహిళా కార్మికులు అస్వస్థతకు గురి కావడంతో వారిని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసుల కథనం మేరకు వివరాలు. చింతలపాళెం టోల్‌గేట్ సమీపంలోని ద్విచక్ర వాహనాలు, 4 వీలర్స్ వాహనాల అలైవీల్స్‌ను తయారు చేస్తారు. శుక్రవారం సాయంత్రం కర్మాగారం పై భాగంలో ఓ పైపు గుండా వెళ్లే ఆయిల్ లీక్ కావడంతో షార్ట్ సర్క్యూట్ అయి మంటలు వ్యాపించాయి. నిమిషాల వ్యవధిలో దట్టమైన పొగతో కూడిన మంటలు ఎగసిపడటంతో ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు, సిబ్బంది భయాందోళనతో రోడ్డు మీదకు పరుగులు తీశారు. మంటలు ఫ్యాక్టరీ లోపలకు వ్యాపించకుండా పైకి ఎగసిపడటంతో కర్మాగారం లోపల ఉన్న కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. మంటలు లోపలకు వ్యాపించి ఉంటే ఊహకందని విపత్తు జరిగి ఉండేది. ప్రమాద విషయం తెలుసుకున్న జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య ప్రమాద స్థలానికి చేరుకున్నారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి, తిరుపతి నుంచి మూడు అగ్నిమాపక వాహనాలను తీసుకొచ్చి మంటలను అదుపు చేశారు. ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు ఎనిమిది మందికి శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులు తలెత్తి అస్వస్థతకు గురై కళ్లు తిరిగి పడిపోయారు. అస్వస్థతకు గురైన వారిలో శాంతి, మధుప్రియ, గురవమ్మ, వెంకటమ్మ, ప్రియ తదితరులు ఉన్నారు. వారిలో ఆరుగురిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఒక యువతిని మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరిని రేణిగుంట సమీపంలోని బాలాజీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, శ్రీకాళహస్తి ఆర్‌డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దార్ ఎం.భార్గవి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు.

హత్య కేసులో ఐదేళ్ల జైలు

ఓజిలి: మండలంలోని గ్రద్దగుంట పంచాయతీ గొల్లపాళెం గ్రామానికి చెందిన మర్రి పొలయ్య హత్య కేసులో నిందితుడు సంచి వీరాస్వామికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం గూడూరు కోర్టు న్యాయమూర్తి నాగపవన్ తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లపాళెం గ్రామానికి చెందిప మర్రి పోలయ్య, సంచి వీరాస్వామి పొలాలకు సంబంధించిన హద్దుల విషయంలో తగాదాలున్నాయి. ఈ క్రమంలో 2017 సంవత్సరం ఏప్రిల్ 10వ తేదీన వరిపంటను కోసేందుకు మర్రి పోలయ్య, అతని కుమారుడు మర్రి ఓంకార్ పొలంలోని సర్వే రాళ్లను తొలగించారు. ఈ సందర్భంలో సంచి వీరాస్వామి, మరికొంత మంది అక్కడకు వచ్చి వాగ్వాదానికి దిగారు. మాటమాట పెరిగి ఘర్షణలకు దారితీశాయి. ఈ క్రమంలో మర్రి పోలయ్య, కుమారుడు మర్రి ఓంకార్‌పై సంచి వీరాస్వామి, మరికొంత మందితో కలసి కర్రలతో దాడిచేశారు. ఇద్దరికీ రక్తగాయాలు అయ్యాయి. పోలయ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన కుమారుడు మర్రి ఓంకార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వాకాడు సీఐ సత్యనారాయణ, స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి కోర్టుకు హాజరుపరిచారు. గూడూరు కోర్టులో విచారణలు పూర్తి కావడంతో న్యాయమూర్తి శుక్రవారం తీర్పును వెల్లడించారు. కేసు దర్యాప్తు ముద్దాయికి శిక్ష పడేలా చేసిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, రూరల్ సీఐ సంగమేశ్వర రావు, ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది డీ.మల్లికార్జున రావు, పీసీ సూర్యా, నారాయణలను తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల స్ఫూర్తితో పనిచేద్దాం

- టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్


మాట్లాడుతున్న ఈవో ఏకే సింఘాల్

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల విజయ స్ఫూర్తితో పనిచేసి తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి వేడుకలను జయప్రదం చేయాలని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పిలుపు నిచ్చారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల అనంతరం శుక్రవారం తిరుపతి మహతి ఆడిటోరియంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పాలక మండలి సభ్యులు, జిల్లా యంత్రాంగం, జిల్లా పోలీస్ విభాగం, టీటీడీలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయం, శ్రీవారి సేవకుల సేవలు, భక్తులు, మీడియా సమష్టి సహకారంతో విజయవంతం చేయగలిగామన్నారు. అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలకు ప్రణాళికాబద్ధంగా సౌకర్యాలు కల్పించేలా మూడు నెలల ముందు నుంచే మార్గదర్శిని రూపొందించామన్నారు. జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ.. ప్రతి రోజూ అధికారులతో సమీక్షించుకుంటూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అందరూ ఒక టీం వర్క్ గా పని చేశారన్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ.. భక్తుల రద్దీని నియంత్రించేందుకు క్యూలైన్లు ఏర్పాటు, టీటీడీ, విజిలెన్స్ , పోలీసులు సమన్వయంతో పనిచేశారన్నారు. సీవీఎస్వో మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఈ ఏడాది అదనంగా 40 వేల మంది భక్తులు వచ్చినా పటిష్ఠ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ, పోలీసు అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

రోగి సహాయకురాలిపై ఆస్పత్రి సిబ్బంది దాడి



రుయా అత్యవసర విభాగం వద్ద దాడి చేసిన ఎంఎన్‌ఓ తీరును ఆక్షేపిస్తున్న బాధితుడి బంధువులు

తిరుపతి తుడా : రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన సోదరుడిని చూసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన సహాయకురాలిపై రుయా సిబ్బంది దాడికి తెగబడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఉదయం రుయాలో చోటు చేసుకుంది. తిరుపతికి చెందిన సాయిరాం చిత్తూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. చికిత్స కోసం ఆయనను రుయాకు తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు రుయాకు చేరుకున్నారు. ఉన్న ఎంఎన్‌ఓ సహాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. బాధితుడి అక్కపై వెనుక నుంచి చేయి చేసుకోవడంతో మహిళలు ఆగ్రహించారు. అత్యవసర విభాగం నుంచి బంధువులను బయటకు గెంటేశారు. దీంతో గాయపడ్డ సాయిరాం బంధువులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పట్ల సిబ్బంది ఇంత దారుణంగా వ్యవహరిస్తారా అంటూ నిలదీశారు. రుయాలో వైద్య సేవలు క్షీణించాయని, ప్రవర్తన కూడా మర్యాదపూర్వకంగా లేదని బాధితురాలు పద్మజ మండిపడ్డారు. దాడికి పాల్పడ్డ ఎంఎన్‌ఓ పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

లైంగికదాడి కేసులో నిందితులకు జీవితఖైదు

సూళ్లూరుపేట : పట్టణంలోని రైల్వేస్టేషన్ మొదటి నంబర్ ప్లాట్‌ఫామ్‌పై 2019 ఫిబ్రవరి 3న రాత్రి ఓ యువతిపై లైంగిక దాడి చేసిన కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదును విధిస్తూ నెల్లూరు ఏడీజే కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చారు. శుక్రవారం ఎస్ఐ బ్రహ్మనాయుడు వివరాలు వెల్లడించారు. అలాగే బాధితురాలి నగదు దోచుకున్నందుకు మరో పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు తెలిపారు. విజయనగరానికి చెందిన 20 ఏళ్ల యువతిపై సూళ్లూరు, బొగ్గులకాలనీ, సాయినగర్‌కు చెందిన నలుగురు యువకులు సామూహికంగా లైంగికదాడి చేసిన ఘటన అప్పట్లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ కేసులోని నలుగురు నిందితుల్లో నాని, పన్నీరు సెల్వం అనే ఇద్దరు ఇప్పటికే మరణించారు. బొగ్గుల కాలనీకి చెందిన తిరువళ్లూరు నవీన్‌కుమార్ (26), సాయినగర్‌కు చెందిన కేకుల దేవ(19) అనే ఇద్దరు నిందితులకు కోర్టు శిక్ష విధించింది. కాకినాడకు చెందిన 24 ఏళ్ల యువకుడు, బాధిత యువతి శ్రీసిటి సెజ్‌లోని ఓ కంపెనీలో పనిచేసేవారు. ఇరువురి మధ్య పరిచయం కాస్తా ప్రేమగా మారింది. పెళ్లి విషయం మాట్లాడుకునేందుకు రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. అదే సమయంలో గంజాయి మత్తులో ఉన్న నిందితులు వారిపై దాడి చేసి యువతిపై లైంగికదాడికి పాల్పడ్డారు. ఆ కేసును విచారించి నిందితులకు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

గంజాయి కేసులో మరో నిందితుడు అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ మురళీనాయుడు

సత్యవేడు : గంజాయి కేసుకు సంబంధించి నిందితుడు విజయ్(30)ని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సీఐ మురళీనాయుడు ఆధ్వర్యంలో మీడియా ముందు నిందితుడిని ప్రవేశపెట్టారు. సీఐ మాట్లాడుతూ.. గత నెల 19న ఒకటిన్నర కిలో గంజాయిని , ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే నిందితుడు శ్రీధర్‌ను అరెస్టు చేశామన్నారు. మరో నిందితుడు విజయ్ పరారీలో ఉండగా శుక్రవారం గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరుపరిచి రిమాండుకు పంపామన్నారు. సమావేశంలో ఎస్ఐ రామస్వామి, పోలీసులు ఉన్నారు.

ఆకట్టుకున్న 'మంత్ర'

- వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులు
- అలరించిన నృత్యాలు, స్పోర్ట్స్ ఈవెంట్


విద్యార్థులతో కలసి గేమ్స్ ఆడుతున్న ఛాన్సలర్ మంచు మోహన్ బాబు


ఎం బ్లాక్ వద్ద డ్యాన్స్‌లతో ఆకట్టుకుంటున్న విద్యార్థులు

చంద్రగిరి : ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మోహన మంత్ర-2025 మహోత్సవం మోహన్ బాబు యూనివర్సిటీ (ఎంబియు)లో శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని, వారి మేధస్సును, వెలికితతీయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. వచ్చిన ప్రతి విద్యార్థిని అతిథులుగా భావించి వారికి తగిన సౌకర్యాలు కల్పించామన్నారు.

సందడి చేసిన మోహన్ బాబు

మోహన మంత్ర-2025 కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీ ఛాన్సలర్ మంచు మోహన్‌బాబు సందడి చేశారు. యూనివర్సిటీలో నిర్వహిస్తున్న వివిధ ఈవెంట్‌లను ఆయన స్వయంగా వెళ్లి తిలకించారు. అనంతరం కొన్ని చోట్ల ఆయన విద్యార్థులతో పాటు ఆయన ఈవెంట్‌లో పాల్గొని సందడి చేశారు. అదే విధంగా ప్రో ఛాన్సలర్ విష్ణు విద్యార్థులతో డ్యాన్సులతో జత కలిసి రెట్టింపు ఉత్సాహాన్ని ఇచ్చారు.

ఉత్సాహంగా ఈవెంట్స్

కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు టెక్నోహోలిక్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఎంబెడెడ్ వర్క్‌షాప్, కోడ్ స్ప్రింట్, లైఫ్ సేవర్ వర్క్‌షాప్, ఈవీ వర్క్‌షాప్, టెక్ ఎక్స్-ప్రోటోటైప్, ఈవీ ఎక్స్‌పో, క్యూజోనోమిక్స్‌లు ఆకట్టుకున్నాయి. కళాక్షేత్ర, స్పోర్ట్స్ ఈవెంట్‌లో భాగంగా లెట్స్ నాచో, చికెన్ డిన్నర్(పబ్జీ), కరోకే కెచప్, పుష్ అప్ ఛాలెంజ్- ఎంప్రాజా ఈవెంట్లు విద్యార్థులను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. అలాగే ఫ్రీ ఫైర్, గల్లీ క్రికెట్, మిక్స్‌డ్ బాస్కెట్ బాల్, ట్రెజర్ హంట్, లక్కీ డ్రా, ఫన్ గేమ్స్, ఫుడ్ ఛాలెంజ్, జార్బింగ్ బాల్స్ వంటి ఈవెంట్లు ఆకట్టుకున్నాయి.

అదరగొట్టిన డ్రమ్స్ శివమణి డీజే

మోహన మంత్ర-2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీ విద్యానికేతన్‌లో మైదానంలో నిర్వహించిన డీజే కార్యక్రమం అదరగొట్టింది. ఈ సందర్భంగా ప్రముఖ వాయిద్యకారుడు డ్రమ్స్ శివమణి తన సంగీతంతో విద్యార్థులను అలరించారు.



